# ఈశావాస్యోపనిషత్తు

– డా. అంబడిపూడి వేంకట రాధేశ్యామ్

**ఉపోద్ఘాతము :**

సమస్తజీవులు నిఖిలదుఃఖనివృత్తి, పరమానందప్రాప్తి రూపమగు మోక్షమును కోరుచున్నారు. అది పరమాత్మా పరోక్షజ్ఞానము వలనే కలుగును. కర్మోపాసనాది ఇతర సాధనముల వలన కలుగదు. ఆ జ్ఞానమును పొందుటకు సాధనచతుష్టయ సంపన్నుడు ఉత్తమాధికారి. ఆ ఉత్తమాధికారి శ్రోత్రియుడగు బ్రహ్మనిష్ఠకలిగిన సద్గురువుని ఆశ్రయించి వేదాంతవాక్య శ్రవణము చేయవలెను. ఈ వేదాంతవాక్య సమాహారమే ఉపనిషత్తులని పేర్కొనబడుచున్నవి. ఉపనిషత్పదము 'షద్' విశరణ గత్యవసాదనేషు అనే ధాతువుకు ఉప, ని అను ఉపసర్గలు చేర్చగా క్విప్ ప్రత్యయాంతమై ఏర్పడును. ఉపనిషత్పదము చేత బ్రహ్మవిద్య ఎలా ప్రతిపాదింపబడుచున్నది అనగా, మోక్షమునందు ప్రబలమైనకోర్కె కలిగి, ఇహపరలోక సుఖవిముఖులైన వారు ఆచార్యోపదేశము చేత బ్రహ్మవిద్యను పొంది బ్రహ్మనిష్ఠులైనచో వారి సంసారబీజమైన అవిద్య సమూలముగా నశించును. అందువలన ఉపనిషత్తు అనగా బ్రహ్మవిద్య అని వ్యవహరించుచున్నారు. వేదములు మొత్తము మూడు కాండలుగా విభజింపబడినవి. అవి 1) కర్మ 2) ఉపాసన 3) జ్ఞానకాండములు. వీటిలోని చివరి రెండు అంటే ఉపాసన, జ్ఞానకాండలను ఉపనిషత్తు అని అంటారు. ఈ ఉపనిషత్తులు గురుశిష్య సంవాదరూపముగా ఉంటాయి. బ్రహ్మజిజ్ఞాసువు అయిన శిష్యుడు బ్రహ్మజ్ఞాని అయిన గురువును సమీపించి, ఆయన అనుగ్రహముతో బ్రహ్మోపదేశం పొందవలెను. నాలుగు వేదాలకు కలిపి ముఖ్యమైన ఉపనిషత్తులు 108. వాటిలో ప్రసిద్ధమైనవి ఈశోపనిషత్తు, కేనోపనిషత్తు, కఠోపనిషత్తు, ప్రశ్నోపనిషత్తు, ముండకోపనిషత్తు, మాండూక్యోపనిషత్తు, తైత్తిరీయోపనిషత్తు, ఐతరేయోపనిషత్తు, ఛాందోగ్యోపనిషత్తు, బృహదారణ్యకోపనిషత్తు.

**ఈశావాస్యోపనిషత్తు**

దశోపనిషత్తులలో మొదటిది ఈశావాస్యోపనిషత్తు. "ఈశావాస్యమిదగ్గ్ సర్వం" అనే మంత్రముతో ఈ ఉపనిషత్తు ప్రారంభం అవుతుంది. అందువలన దీనికి ఈశావాస్య ఉపనిషత్తు అనే పేరు వచ్చింది. యజుర్వేదం యొక్క శుక్లయజుర్వేదములో వాజసనేయసంహిత ఉంది. ఇందులో 40 అధ్యాయాలు ఉన్నాయి. ఈ ఉపనిషత్తు 40వ అధ్యాయము. ఇందులో 18 మంత్రాలు ఉన్నాయి. మిగిలిన ఉపనిషత్తులలాగా కాకుండా ఇది మంత్రభాగంలో చేరినది. ఈ ఉపనిషత్తులో పేర్కొనబడ్డ విద్య లేక భగవంతుని సాక్షాత్కరించుకొనే సాధనను "ఈశవిద్య" అంటారు. ఈశావాస్య ఉపనిషత్తు క్రింది శాంతి మంత్రముతో ప్రారంభము అవుతుంది.

**ఈ ఉపనిషత్తు శాంతిమంత్రము**

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

అది (ఆ కనిపించని అనంతం) పూర్ణం. ఇది కూడా (కనిపించే అనంతవిశ్వం) పూర్ణం. పూర్ణం నుంచి ఈ పూర్ణం బహిర్గతమౌతోంది. పూర్ణం నుంచి పూర్ణం తీసివేసినా పూర్ణమే మిగిలివుంటుంది.

**సారాంశము**

**ఓం ఈశావాస్య మిదగ్ం సర్వం యత్కించ జగత్యాం జగత్**

**తేన త్యక్తేన భుంజీథా: మాగృథ: కస్యస్విద్ధనమ్.**

ఈ జగత్ లో మార్పుచెందేది ఏదేది వున్నదో అదంతా భగవంతునిచేత ఆవరింపబడి వుంది. ఈ త్యాగభావనచేత జీవించు, ఎవరి ధనాన్ని మాత్రం ఆశించకు అని జగత్తుని బ్రహ్మమయముగా దర్శించాలనే ఉపదేశముతో ఈ ఉపనిషత్తు ప్రారంభమగుచున్నది.

## అవిద్యోపాసన ఫలము

శాస్త్రవిహితమైన నిత్య నైమిత్తిక కర్మలు ఆచరిస్తూ మాత్రమే మానవుడు నూరు సంవత్సరాలు జీవించాలని కోరుకోవాలి. మానవజీవితంపైన ఆసక్తి వున్నంతవరకు దుష్కర్మ కాలుష్యాన్ని దూరం చేసుకోవడానికి ఇది తప్ప మరోదారి లేదు. బ్రహ్మను తిరస్కరించే జన్మలు కటిక చీకటిచేత ఆవరింపబడిన రాక్షసజన్మలు. ఆత్మహంతకులైనవారు మరణానంతరం వాటిని పొందుతారు.

## ఆత్మస్వరూప వర్ణన

ఆత్మ ఒక్కటే చలించనిదైనా మనస్సుకంటే వేగవంతమైనది. మనస్సుకన్నా ముందే వెళ్లగలదు కనుక అది ఇంద్రియాలకు అందదు. నిత్యమూ స్థిరమైనదైనా పరుగెత్తే అన్నిటికన్నా వేగవంతమైనది. ఆత్మ సకలప్రాణికోటుల కార్యకలాపాలను భరించటానికి ప్రాణశక్తిని సమకూరుస్తోంది. ఆత్మ చలిస్తోంది, చలించదు. అది దూరంలో వుంది, దగ్గర కూడా వుంది. అది లోపల బయట అంతా వుంది. అన్ని జీవులు తన ఆత్మకంటే వేరైనవి కావనీ, తన ఆత్మే అన్ని జీవులలోని ఆత్మగా దర్శించేవాడు దేనిని ద్వేషింపడు. అన్ని జీవులను తన ఆత్మగాను, చరాచర జగత్తును ఆత్మయొక్క ఏకత్వంగాను దర్శించే ఆత్మజ్ఞానికి శోకమోహాలు శాశ్వతముగా నశించిపోతవి. స్వయంభువు, సర్వవ్యాపి, అశరీరి, పాపకళంక రహితుడు, ప్రకాశవంతుడు, పరిపూర్ణుడు, స్వచ్ఛమైనవాడు, సర్వదర్శి, సర్వవిదుడు అయిన ఆత్మ శాశ్వతులైన ప్రజాప్రతులకు యధావిధిన వారివారి కర్తవ్యాలను ఇచ్చాడు.

## అవిద్యోపాసన ఫలము

అవిద్యను ఉపాసించేవారు గాఢాంధకారంలో ప్రవేశిస్తారు. అంతకంటే అంధకారంలో అవిద్యలో ఆనందించేవారు ప్రవేశిస్తారు. విద్య, అవిద్య ఈ రెండింటినీ తెలుసుకున్నవాడు అవిద్యవల్ల మృత్యువును జయించి, విద్యవల్ల అమరత్వాన్ని పొందుతాడు. ప్రకృతిని ఉపాసించేవారు గాఢ అంధకారంలో ప్రవేశిస్తారు. అంతకంటే మించినదా అనిపించే చీకటిలో హిరణ్యగర్భుని ఉపాసించి ఆనందించేవారు ప్రవేశిస్తారు.

హిరణ్యగర్భుని ఉపాసనవల్ల ఒక ఫలితం, ప్రకృతి ఉపాసనవల్ల మరొక ఫలితం వస్తుందని వారు చెబుతారు. దీనిని మాకు వివరించిన ప్రాజ్ఞులనుండి ఈ విధంగా విన్నాం. అసంభూతినీ, వినాశాన్నీ కలిపి తెలుసుకున్నవాడు, వినాశం (హిరణ్యగర్భుని) ఉపాసన ద్వారా మృత్యువును జయించి, అసంభూతి (ప్రకృతి) పై భక్తి ద్వారా అమరత్వాన్ని పొందుతాడు. ఓ సూర్యదేవ! నీలో వున్న సత్యం ద్వారాన్ని, మెరుస్తూ వున్న నీ బంగారు బింబం మూతలాగా కప్పి వుంది. ఓ సూర్యదేవా! సత్యనిష్ఠుడైన నేను ఆ సత్యాన్ని చూడటానికి వీలుగా ఆ మూతను పక్కకి తప్పించు.

## పరమాత్మ దర్శన ప్రార్థన

ఓ సూర్యుడా! ప్రజాపతిపుత్రుడా! స్వర్గవీధిలో ఒంటరి బాటసారీ! సర్వపోషకా! సర్వనియంతా! నీ కిరణాలను తొలగించు. కాంతిని ఉపసంహరించుకో. నీ అనుగ్రహం వల్ల కళ్యాణమయమైన నీ రూపాన్ని చూడగలను. నిజంగా నీలో వుండే ఆ పురుషుడు నేనే అని గ్రహించాను. ఇక నా ప్రాణవాయువు సర్వవ్యాపి, శాశ్వతమూ అయిన ప్రాణంలో లీనమగుగాక. ఈ శరీరం బూడిద అగుగాక. ఓం ఓ మనసా! గుర్తుకు తెచ్చుకో, నీ పూర్వ కర్మలను గుర్తుకు తెచ్చుకో అని గుర్తు చేస్తూ, చివరగా

**అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవవయునాని విద్వాన్ ।**
**యుయోధ్యస్మ జ్జుహురాణమేనో భూయిష్ఠాం తే నమ ఉక్తిం విధేమ ॥**

ఓ అగ్నిదేవా! మేము చేసిన కర్మఫలితాలను అనుభవించడానికి మమ్మల్ని మంచి త్రోవలో నడిపించు. మేము ఆచరించిన కర్మలన్నీ నీకు తెలుసు. ఓ అగ్నిదేవా! మాలో పాపాలను దూరం చేయుము. నీకు పలుమార్లు నమస్కారం చేస్తున్నాము అని నమస్కార సమర్పణతో ఈ ఉపనిషత్తు ముగుస్తుంది.

స్వస్తి

# ఈశావాస్యోపనిషత్

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

ఓం ఈశా వాస్యమిదగ్ం సర్వం యత్కిం చ జగత్యాం జగత్ ।
తేన త్యక్తేన భుంజీథా మా గృధః కస్య స్విద్ధనం ॥ ॥ 1 ॥

కుర్వన్నేవేహ కర్మాణి జిజీవిషేచ్ఛతగ్ంసమాః ।
ఏవం త్వయి నాన్యథేతోఽస్తి న కర్మ లిప్యతే నరే ॥ ॥ 2 ॥

అసుర్యా నామ తే లోకా అంధేన తమసా వృతాః ।
తాగ్ంస్తే ప్రేత్యాభిగచ్ఛంతి యే కే చాత్మహనో జనాః ॥ ॥ 3 ॥

అనేజదేకం మనసో జవీయో నైనద్దేవా ఆప్నువన్పూర్వమర్షత్ ।
తద్ధావతోఽన్యానత్యేతి తిష్ఠత్తస్మిన్నపో మాతరిశ్వా దధాతి ॥ 4 ॥

తదేజతి తన్నైజతి తద్దూరే తద్వంతికే ।
తదంతరస్య సర్వస్య తదు సర్వస్యాస్య బాహ్యతః ॥ ॥ 5 ॥

యస్తు సర్వాణి భూతాన్యాత్మన్యేవానుపశ్యతి ।
సర్వభూతేషు చాత్మానం తతో న విజుగుప్సతే ॥ ॥ 6 ॥

యస్మిన్సర్వాణి భూతాని ఆత్మైవాభూద్విజానతః ।
తత్ర కో మోహః కః శోక ఏకత్వమనుపశ్యతః ॥ 7 ॥

స పర్యగాచ్ఛుక్రమకాయమవ్రణమస్నావిరగ్ం శుద్ధమపాపవిద్ధం ।
కవిర్మనీషీ పరిభూః స్వయంభూర్యాథాతథ్యతోఽర్థాన్
వ్యదధాచ్ఛాశ్వతీభ్యః సమాభ్యః ॥ ॥ 8 ॥

అంధం తమః ప్రవిశంతి యే అవిద్యాముపాసతే ।
తతో భూయ ఇవ తే తమో య ఉ విద్యాయాగ్ంరతాః ॥ 9 ॥

అన్యదేవాహుర్విద్యయా అన్యదాహురవిద్యయా ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే ॥ ॥ 10 ॥

విద్యాం చావిద్యాం చ యస్తద్వేదోభయగ్ం సహ ।
అవిద్యయా మృత్యుం తీర్త్వా విద్యయామృతమశ్నుతే ॥ ॥ 11 ॥

అంధం తమః ప్రవిశంతి యేఽసంభూతిముపాసతే ।
తతో భూయ ఇవ తే తమో య ఉ సంభూత్యాగ్ం రతాః॥ ॥ 12 ॥

అన్యదేవాహుః సంభవాదన్యదాహురసంభవాత్ ।
ఇతి శుశ్రుమ ధీరాణాం యే నస్తద్విచచక్షిరే ॥ ॥ 13 ॥

సంభూతిం చ వినాశం చ యస్తద్వేదోభయగ్ం సహ ।
వినాశేన మృత్యుం తీర్త్వా ఽసంభూత్యామృతమశ్నుతే ॥ ॥ 14 ॥

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యాపిహితం ముఖం ।
తత్త్వం పూషన్నపావృణు సత్యధర్మాయ దృష్టయే ॥ ॥ 15 ॥

పూషన్నేకర్షే యమ సూర్య ప్రాజాపత్య వ్యూహ రశ్మీన్ సమూహ ।
తేజో యత్తే రూపం కల్యాణతమం తత్తే పశ్యామి
యోఽసావసౌ పురుషః సోఽహమస్మి ॥ ॥ 16 ॥

వాయురనిలమమృత మథేదం భస్మాంతగ్ం శరీరం ।
ఓం క్రతో స్మర కృతగ్ంస్మర ఓం క్రతో స్మర కృతగ్ంస్మర ॥ ॥ 17 ॥

అగ్నే నయ సుపథా రాయే అస్మాన్ విశ్వాని దేవ వయునాని విద్వాన్ ।
యుయోధ్యస్మజ్జుహురాణమేనో భూయిష్ఠాం తే నమఉక్తిం విధేమ ॥ 18 ॥

ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావ శిష్యతే ॥

**ఓం శాంతిః శాంతిః శాంతిః**

**ఇతి ఈశావాస్యోపనిషత్ సమాప్తః**